నాకే ఎందుకు ఓటు వేయాలంటే!

'సాక్షి' ప్రశ్నకు ప్రధాన పార్టీ అభ్యర్థుల సమాధానం

ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. కాలనీలు, బస్తీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి తమ పార్టీల మేనిఫెస్టోను వివరించడంతో పాటు తమను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంలో చేయబోయే అభివృద్ధి పనులపై హామీలు ఇస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కాగా, ఎల్బీనగర్ బరిలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీగౌడ్, బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డిలను 'మీకు ఎందుకు ఓటు వేయాలి' అని 'సాక్షి' ప్రశ్నించగా .. వారు ఇలా సమాధానం ఇచ్చారు. – ఎల్బీనగర్

అధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తా..



ఎల్బీనగర్ నియోజకవర్గంలోని నిరుద్యోగులకు నా సొంత ఖర్చులతో కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి వారికి స్కిల్ డెలప్‌మెంట్‌ను పెంచుతా. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రం, కేంద్రం నుంచి అధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసే సత్తా నాకు ఉంది. నియోజకవర్గం ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తా. సుపరిపాల కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఎల్‌బీనగర్‌లో నన్ను గెలిపించాలని కోరుతున్నా.

– మధుయాష్కీ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి

95 శాతం అభివృద్ధి నేనే చేశా..



నియోజకవర్గంలో గడిచిన ఐదు సంవత్సరాల్లో 95 శాతం అభివృద్ధి చేశా. కేవలం 5 శాతం మాత్రమే మిగతా వారు చేశారు. అండర్‌పాస్, స్కైవేలు, ఫ్లై ఓవర్లు నిర్మించి ఎల్‌బీనగర్‌ను ట్రాఫిక్ ఫ్రీగా మార్చాం. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతో ఇళ్ల రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించా. మరోసారి నాకు అవకాశం ఇచ్చి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తా. అందుకే నాకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నా.

–దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి

అభివృద్ధి ఏమిటో చూపిస్తా



ఓటమి చెందినా ప్రజలకు దూరం కాలేదు. గత 16 ఏళ్లుగా ప్రజా సేవ చేస్తూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నా. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోనే పుట్టి స్థానికంగా పెరిగిన నాకు ప్రతి సమస్యపై అవగాహనతో పాటు నియోజకవర్గంపై పూర్తి స్థాయి పట్టు ఉంది. గత కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తూ మహిళలకు, యువతకు సహాయ సహకారాలు అందిస్తున్నా. నన్ను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా. ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతున్నా. – సామ రంగారెడ్డి, బీజేపీ అభ్యర్థి

అధికార పార్టీని ఓడించాలి

రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి చెన్నోజు శ్రీనివాసులు



ప్రచారంలో మాట్లాడుతున్న చెన్నోజు శ్రీనివాసులు

హస్తినాపురం: రాష్ట్రంలో కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీలను చిత్తుగా ఓడించాలని కార్పొరేట్ విద్యానియంత్రణ జేఏసీ చైర్మన్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి చెన్నోజు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నోజు శ్రీనివాసులు మాట్లాడుతూ, ప్రభుత్వం కూలే గోడలకు రంగులేసి మనఊరు–మనబడి అని ఆర్భాటంగా ప్రచారం చేస్తోందని విమర్శించారు. కార్పొరేట్ విద్యా వ్యాపారులకు కొంగు కాస్తున్న పాలకులను ఇంటికి పంపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జె.యోగేశ్‌యాదవ్, వినోద్‌చారి, లింగస్వామి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి



వనస్థలిపురంలోని లక్ష్మీగణపతి గుడిలో.. సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు



మన్సూరాబాద్ సహారాస్టేట్స్ కాలనీలోని లలితా నాగలింగేశ్వరస్వామి ఆలయంలో...

మన్సూరాబాద్/వనస్థలిపురం: ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలో కార్తీక పౌర్ణమిని సోమవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే శైవ క్షేత్రాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేసి కార్తీక దీపారాధన చేశారు. పలు ఆలయాల్లో రుద్రాభిషేకాలు, అర్చనలు చేశారు. అంతేకాకుండా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. మన్సూరాబాద్ సహారాస్టేట్స్‌కాలనీలోని ఉమా నాగలింగేశ్వరస్వామి ఆలయంలో, వనస్థలిపురంలోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో కార్తీక పూజలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వ్రతాలను తిలకించారు.

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు

మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం: ఆలయం ఎదుట మేనిఫెస్టోను చూపిస్తున్న లక్ష్మారెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అధికారంలో రాగానే కచ్చితంగా అమలు చేస్తుందని మహేశ్వరం ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) అన్నారు. సోమవారం మండలంలోని శ్రీ శివగంగా రాజరాజేశ్వర ఆలయంలో స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ...తనను గెలిపిస్తే అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పని చేస్తానని, తుక్కుగూడలోనే నివాసం ఏర్పాటు చేసుకొని ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హవా కొనసాగుతుందన్నారు. అధికారంలోకి వస్తే మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రైతు భరోసా కింద రూ.15 వేలు పెట్టుబడి సాయం, వరి పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, సీనియర్ నాయకుడు వెంకటప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు ఈశ్వర్, కృష్ణ నాయక్ నాయకులు రాజునాయక్, నారాయణ, కుమార్, ప్రశాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్వకుంట్ల కుటుంబాన్ని ఇంటికి సాగనంపాలి

ఆర్‌కేపురం కాంగ్రెస్ నాయకురాలు హర్షలత



కేఎల్లార్‌కు మద్దతుగా ఆర్‌కేపురంలో ప్రచారం చేస్తున్న తమలపాకుల హర్షలత

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలనకు బీఆర్ఎస్ పార్టీని ఈ ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని కాంగ్రెస్ పార్టీ ఆర్‌కేపురం డివిజన్ మహిళా సీనియర్ నాయకురాలు తమలపాకుల హర్షలత అన్నారు. సోమవారం ఆర్‌కేపురం డివిజన్‌లో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి మద్దతుగా డివిజన్ పరిధిలోని ఆర్‌కేపురం, టెలిఫోన్ కాలనీ, అల్కాపురి కాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి పేరుతో పార్టీ మారి మహేశ్వరం ప్రజలను మోసం చేసిన సబితారెడ్డిని ఈ ఎన్నికల్లో ఓడించి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేఎల్లార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకురాలు శకుంతల, శిరీష చౌదరి, నిర్మలా రెడ్డి, సోనీ, ధనలక్ష్మి, శ్రీవల్లి, సునీతారెడ్డి, బాలమణి, నాగవల్లి తదితరులు పాల్గొన్నారు.

నా జీవితం ప్రజలకే అంకితం

ఎల్‌బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి



సామ రంగారెడ్డికి హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న యువతి



ఎల్‌బీనగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: సకల జనుల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని, ప్రతి మహిళా ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికే మహిళా రిజర్వేషన్ బిల్లును బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిందని బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్‌లోని ఎల్‌బీనగర్, మసీద్‌గల్లీ ప్రాంతాల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, ముస్లిం మహిళల భద్రత కోసం ట్రిబుల్ తలాక్‌ను రద్దు చేసిన ఘనత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదేనని అన్నారు. ఎల్‌బీనగర్ ప్రజల సంక్షేమమే తన కర్తవ్యమని, అన్ని విషయాల్లో అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎల్‌బీనగర్ అభివృద్ధి కోసం తనను ఆశీర్వదించాలని, తన జీవితాన్ని ప్రజలకే అంకితమని అన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఎల్‌బీనగర్ ప్రజలను మోసం చేశాడని, ఇలాంటి మోసగాళ్లకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయభాస్కర్, గుండే కిరణ్‌కుమార్, జగదీష్, రమేష్‌గుప్తా, యాదయ్య, భరత్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

- ప్రభుత్వ స్థలాలను కాపాడ్సాన బాధ్యతలో ఉన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కంచే చేను మేసిన విధంగా వాటికి కొల్లగొడుతున్నాడని, ప్రజా సేవను మరచి కబ్జాల యావలో ఉన్నాడని బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి ఎల్‌బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధ్వజమెత్తారు.
- చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి రెడ్డి కాలనీలో, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శ్రీరామ్‌నగర్‌కాలనీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు.
- మన్సూరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు యువకులు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో చేరారు.

సబితారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పట్లోళ్ల కల్యాణ్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సబితారెడ్డికి మద్దతుగా నాయకులు జహీర్, ఇస్మాయిల్ ఆధ్వర్యంలో సోమవారం సరూర్‌నగర్‌లో మైనారిటీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి యువ నాయకుడు పట్లోళ్ల కల్యాణ్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని, సరూర్‌నగర్‌లో శ్మశాన వాటికతో పాటు మసీద్ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు మంజూరు చేశారన్నారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న చిల్లా సమస్యను కూడా మంత్రి సబితారెడ్డి పరిష్కరించారని గుర్తుచేశారు. కారు గుర్తుకు ఓటు వేసి ఆమెను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ మురళీధర్‌రెడ్డి, నాయకులు బాలకిషన్, మహేందర్‌యాదవ్, దయాకర్‌రెడ్డి, సాధిక్, సలీం, జహంగీర్, రజాక్, హైదర్, ఇర్ఫాన్, మహబూబ్, హఫీజ్, అజార్, నిజాం, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

కేక్ మిక్స్..



వనస్థలిపురం: నగరంలో క్రిస్మస్ సందడి మొదలైంది. క్రిస్మస్ సందర్భంగా వనస్థలిపురంలోని కారామెల్ బేకరీలో సోమవారం కేక్ మిక్స్ చేపట్టారు. వివిధ రకాల పదార్థాలు, డ్రైఫ్రూట్స్ మిక్స్ చేసి కేక్‌ను తయారు చేసినట్లు బేకరీ నిర్వాహకుడు సుబ్బారెడ్డి తెలిపారు.

మలక్‌పేటలో బీజేపీ విజయం ఖాయం

అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి



సైదాబాద్‌లో ఓటు అభ్యర్థిస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

సైదాబాద్: మలక్‌పేట నియోజకవర్గ ఎన్నికల్లో ఈసారి కమల వికాసం ఖాయమని బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం సైదాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వరిగంటి వినోద్‌గౌడ్ ఆధ్వర్యంలో కాలనీల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన ఇంటింటికీ వెళ్లి పార్టీ కరపత్రాలు పంచి తనను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవినీతిరహిత పాలన కోరుకుంటున్న మలక్‌పేట వాసులు ఎన్నికల్లో మజ్లిస్‌కు తగిన గుణపాఠం చెపుతారని అన్నారు. మలక్‌పేట ప్రజలు తనను ఆదరించి ఒక్కసారి అవకాశం ఇస్తే నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అవకాశం ఇవ్వండి.. మీ బిడ్డలా పనిచేస్తా

మహేశ్వరం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్



కొత్తూర్‌లో మాట్లాడుతున్న అందెల శ్రీరాములు

కందుకూరు: తనను గెలిపిస్తే అందరి సంక్షేమానికి మీ కొడుకులా పని చేస్తానని మహేశ్వరం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని 11 గ్రామాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో కొత్తగా పింఛన్లు, రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే ఒకే ఇంట్లో ఇద్దరికి పింఛన్లు ఇస్తామని, అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి, జ్యోతిపాండు, అశోక్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి ఆశించి ఒక్కసారి అవకాశం ఇవ్వండి

యాకుత్‌పురా బీజేపీ అభ్యర్థి వీరేంద్రబాబు యాదవ్



ఓట్లు అభ్యర్థిస్తున్న వీరేంద్రబాబు యాదవ్

సైదాబాద్: అభివృద్ధిని ఆశిస్తున్న యాకుత్‌పురా ప్రజలు తనకు ఒక్కసారి అవకాశమిచ్చి గెలిపించాలని నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎన్.వీరేంద్రబాబు యాదవ్ కోరారు. సోమవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో పాదయాత్ర ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలకు పార్టీ కరపత్రాలు పంచుతూ కమలం పువ్వు గుర్తుకు ఓటెయ్యాలని అభ్యర్థించారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు ఈసారి మజ్లిస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వీరేంద్రబాబు యాదవ్ అన్నారు.

మలక్‌పేటలో గులాబీ జెండా ఎగుర వేస్తాం..

– తీగల సునరితారెడ్డి



మూసారంబాగ్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి అజిత్‌రెడ్డి సతీమణి సునరితారెడ్డి

మలక్‌పేట: నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేయడం తథ్యమని మలక్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి సతీమణి, మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మూసారంబాగ్, ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. సుస్థిరమైన పాలన, అన్ని వర్గాల సంక్షేమం కోసం కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఆమె కోరారు. డివిజన్ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అభిషేకం, సందీప్, నరేష్, ప్రశాంత్, పారమ్మ, సరిత, పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైపే ప్రజల మొగ్గు

– మలక్‌పేట అభ్యర్థి షేక్ అక్బర్



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న షేక్ అక్బర్

మలక్‌పేట: ఈ ఎన్నికల్లో మలక్‌పేట ప్రజలు మూడు రంగుల జెండా వైపే మొగ్గుచూపుతున్నారని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ అక్బర్ అన్నారు. మూసారంబాగ్‌లో డివిజన్‌లోని సలీంనగర్ రిలయన్స్ ట్రెండ్స్, రామారావు కంపెనీ, కేజీహెచ్ హాస్పిటల్, సెయింట్ మేరీ గ్రామర్ స్కూల్, ఆఫ్జల్‌నగర్, శ్రీపురం కాలనీ, ఈస్ట్ ప్రశాంత్‌నగర్, వడ్డెరబస్తీలలో పాదయాత్ర చేస్తూ ప్రచారం చేశారు. చెయ్యి గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నాయకులు విజయసింహారెడ్డి, లింగాల శ్రీనివాస్‌గౌడ్, బోనగిరి చంద్రశేఖర్, రవీందర్‌యాదవ్, సురేందర్‌రెడ్డి, సోహెల్ పాల్గొన్నారు.

మజ్లిస్‌ను ఢీకొట్టడం ఎవరి తరమూ కాదు

– హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



మజ్లిస్ అభ్యర్థి అహ్మద్ బలాలతో సెల్ఫీ దిగుతున్న నాయకులు

మలక్‌పేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అక్బర్‌బాగ్ చౌరస్తాలో గ్రూప్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, అభ్యర్థి అహ్మద్ బలాల హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ, కాంగ్రెస్, బీజేపీల మాయ మాటలు నమ్మవద్దని, మలక్‌పేటలో మజ్లిస్‌ను ఢీకొట్టడం ఎవరి తరమూ కాదన్నారు. పతంగి గుర్తుపై ఓటేసి బలాలను గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, పార్టీ నాయకులు షఫీయుద్దీన్, అబ్రార్, క్రిస్టియన్ నాయకులు జయరాజ్ బెంజిమిన్, అనిల్,పాల్గొన్నారు.

ఇందిరమ్మ పథకంతో పేదలకు ఇళ్లు

ఎల్బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్



భూపేశ్‌గుప్తానగర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్



వనస్థలిపురంలోని గురుద్వార్ వద్ద సిక్కులతో మధుయాష్కీ

వనస్థలిపురం: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గూడు లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. సోమవారం సీపీఎం నాయకులతో కలిసి హస్తినాపురం డివిజన్‌లో భూపేష్ గుప్తానగర్, నందనవనం కాలనీలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ ప్రభుత్వం రాగానే ఈ ప్రాంతంలోని నిర్వాసితులకు ఇళ్ల పట్టాలతో పాటు అర్హులకు రేషన్ కార్డులు, మహిళలకు రూ. 2500, ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ వస్తాయని అన్నారు.

◆ నాగోల్ డివిజన్‌లోని ఎన్విరాన్ ఎస్టేట్ అపార్ట్‌మెంట్‌లో జరిగిన సమావేశంలో మధుయాష్కీ గౌడ్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నెట్ట డిసౌజా మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో మధుయాష్కీ 45 వేల మెజార్టీతో గెలుస్తారని తెలుస్తోందని అన్నారు. జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, శైలజా రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ ఆదివారం రాత్రి రోషన్ దౌలాలో బస్తీ నిద్ర చేశారు. సోమవారం ఉదయం బస్తీలో గల్లీ గల్లీ తిరుగుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను బస్తీవాసులకు వివరించారు. బస్తీవాసులకు మంచినీరు అందించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, సామ రాంమోహన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ వనస్థలిపురంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మధుయాష్కీ గౌడ్ పాల్గొన్నారు. పద్మశాలీల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. సంఘం అధ్యక్షుడు మ్యాన సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్, ఉమా శ్రీనివాస్, నాయకులు కర్నాటి శ్రీను పాల్గొన్నారు.

◆ వనస్థలిపురంలోని గురుద్వార్‌ను సోమవారం మధుయాష్కీ గౌడ్ సందర్శించారు. గురునానక్ జయంతి సందర్భంగా నిర్వహించిన గురు పూరబ్ వేడుకలు, భక్తి గీతాల ఆలాపన, పూజల్లో పాల్గొన్నారు.

తెలంగాణ సాధనలో మధుయాష్కీ పాత్ర కీలకం: రఘువీరారెడ్డి

హయత్‌నగర్: తెలంగాణ సాధనలో మధుయాష్కీ గౌడ్ కీలక పాత్ర వహించారని, సోనియా గాంధీ కుటుంబంతో ఉన్న సన్నిహిత్యం వల్ల రాష్ట్ర విభజనకు వారిని ఒప్పించారని ఏపీ పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్‌కు మద్దతుగా హయత్‌నగర్‌లో జరిగిన యాదవ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మధుయాష్కీ మాట్లాడుతూ, తనను గెలిపిస్తే బలహీన వర్గాల గొంతుకై అసెంబ్లీలో గళం వినిపిస్తానన్నారు. న్యాయవాది చలసాని వెంకటేశ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌డీఎల్ నేత జయంత్ చౌదరి, సినీ నిర్మాత బండ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే పాతబస్తీ సమగ్రాభివృద్ధి

యాకుత్‌పురా అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి



ఐఎస్‌సదన్‌లో ప్రచారం చేస్తున్న సామ సుందర్‌రెడ్డి

సైదాబాద్: బీఆర్ఎస్‌తోనే పాత బస్తీ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని యాకుత్‌పురా నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఐఎస్‌సదన్‌లోని పలు కాలనీల్లో పాదయాత్ర ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నివర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేసిన పథకాలే తమ గెలుపునకు దోహదం చేస్తాయన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగింపు కోరుకుంటున్న యాకుత్‌పురా ప్రజలు ఈసారి ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రచారంలో ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, కార్తీక్‌గౌడ్, శివకుమార్ పాల్గొన్నారు.

వారిని గెలిపిస్తే... ఐదేళ్లు గోస తప్పదు!

- అభివృద్ధి చేశా.. మరోసారి ఆశీర్వదించండి
- ఎల్బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ప్రగతినగర్ కాలనీలో సుధీర్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న మహిళ



గజమాల నడుమ గొర్రె పిల్లతో సుధీర్‌రెడ్డి

చంపాపేట: నిత్యం కాలనీవాసులతో మమేకమై..వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పిలిస్తే పలికే నాయకుడు కావాలా...నియోజకవర్గ సరిహద్దులు కూడా తెలియని, పిలిచినా పలకని నేత కావాలా ? అని ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో మాజీ కార్పొరేటర్ భవానీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి కారుగుర్తుకే ఓటు వేసి తనను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డికి కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు గజమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించి తమ మద్దతు ప్రకటించారు.

◆ అనంతరం ప్రగతినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... మరోసారి తనను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపిస్తే ఎల్‌బీనగర్‌ను మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. గడచిన ఐదేళ్ల పాటు మీలో ఒకడిగా ఉంటూ కాలనీ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేశానని అన్నారు. ఒకప్పుడు ఎల్‌బీనగర్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండేదని, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, స్కై ఫ్లై ఓవర్లు నిర్మించి సమస్యను పరిష్కరించామన్నారు.

◆ ప్రభుత్వ స్థలాలలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న పేదలకు జీఓ 58, 59 ద్వారా ఇంటి పట్టాలు అందించటంతో పాటు ఎల్‌బీనగర్‌లోని 38 కాలనీలలో దశాబ్దాల తరబడి క్రమబద్ధీకరణకు నోచుకోని ఇళ్లు, ఖాళీ ప్లాట్ల రిజిస్ట్రేషన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కేసీఆర్, కేటీఆర్ అండదండలతో జీఓ 118 తీసుకొచ్చామన్నారు.

◆ స్థానిక సమస్యలపై అవగాహన, నియోజకవర్గ సరిహద్దులు కూడా తెలియని ఇతర పార్టీ అభ్యర్థులు ప్రచార, హంగూ, ఆర్భాటాలలు, అమలుకు వీలుకాని హామీలతో మీ ముందుకు వస్తున్నారని, ఆదమరచి ఓటు వేసి గెలిపిస్తే ఐదేళ్ల పాటు ఇక్కట్లు తప్పవని అన్నారు. యథావిధిగా అభివృద్ధి సంక్షేమం కొనసాగాలంటే కారుగుర్తుపై ఓటు వేసి బీఆర్ఎస్‌కు మరోసారి అధికార పగ్గాలు అందించాలని ఆయన కోరారు.

చంపాపేటలో...

చంపాపేట డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్, కటకోని కుంట, నెహ్రూనగర్, రెడ్డి బస్తీ, ముస్లింబస్తీ, చిలుక బస్తీ, హరిజనవాడ, అంబేడ్కర్‌వాడ కాలనీలలో ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డితో కలిసి గడప గడపకు వెళ్లి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కారు గుర్తుపై ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు ముడుపు రాజిరెడ్డి, రాఘవాచారి, శివగౌడ్, శ్రీనివాస్, గిరి, తిరుపతిరెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.